# క్షంతవ్యుడు

**కొ**న్ని రకాల ఉద్యోగాలకు నాలాంటి సున్నిత మనస్కులు పనికిరారని నేనెప్పుడూ అనుకుంటూ వుంటాను. దురదృష్టవశాత్తూ నేను ప్రస్తుతం చేసే ఉద్యోగం అలాంటిదే. ఎయిడ్స్ రోగ నిర్ధారణ చేయటం, హైద్రాబాద్‌లో వున్న మూడు డయాగ్నొస్టిక్ సెంటర్స్‌లో ఒకదానికి నేను ఇన్‌ఛార్జిని. రోగుల నించి ఎలీసా టెస్ట్‌కి అవసరమైన రక్తం తీసి - పరిశీలించాక, ఎయిడ్స్ వైరస్ పాజిటివో కాదో సర్టిఫై చేయటం నా విధి.

మృత్యు నీడలు పర్చుకున్నట్లు మొఖాలు మ్లానమై - నడిచొచ్చే శవాల్లా కన్పించే రోగుల్ని చూసినపుడు బోల్డంత జాలి నాలో.. రిపోర్ట్ కవర్‌లో పెట్టి చేతికిస్తున్నప్పుడు వాళ్ళు ఆశగా నా మొహంలో ఆ రిపోర్ట్ చదవటానికి ప్రయత్నిస్తున్నట్లు - అనీజీఫీలింగ్ నాలో.. అందుకే అది పాజిటివ్ వచ్చినా, నెగటివ్ అయినా మొహాన్ని "ఉడెన్ ఫేస్" లా పెట్టటం నేర్చుకున్నాను.

నా మొహంలో జాలో, సంతోషమో, కన్పించక పోయేప్పటికి కన్ఫ్యూజ్ అయినట్లు మొహాలు ప్రశ్నార్థకాల్లా పెట్టి కవర్‌లోని రిపోర్ట్ బైటికి తీస్తారు. అప్పుడు నాకు వాళ్ళలో అంతులేని టెన్షన్ కన్పిస్తుంది. ఆ కాగితంలో తమ చావో, బ్రతుకో రాసిపెట్టి వున్నట్లు. అది పాజిటివ్ అని వుంటే అక్కడే కూలబడిపోతారు - మరణశిక్ష విధించబడిన ఖైదీల్లా... నాకు గిల్టీ ఫీలింగ్.. ఆ మరణశాసనం మీద సంతకం పెట్టిన పాపిష్టి జడ్జిలా... నేను.

అందుకే పరీక్షలు జరుపుతున్న ప్రతి సారీ దేవుణ్ణి మొక్కుకుంటాను. రిజల్ట్ నెగిటివ్ రావాలని.. ఆ రిపోర్ట్ చూసుకున్న వ్యక్తి మొహంలో కన్పించే కోటి సూర్య ప్రభల కాంతి నా మీదా పరావర్తనం చెందుతుంది కాబట్టి...

ఎటొచ్చీ విచ్చలవిడిగా తిరిగి - విశృంఖల శృంగారంలో మునిగి - ఎయిడ్స్‌కి ఎరగా దొరికిపోయే వారిమీద నాకు జాలి లేదు - ఏహ్యాభావం తప్ప. పవిత్రమైన వివాహవ్యవస్థ

మీద నాకున్న అంతులేని గౌరవం - మన జాతి సంస్కృతిని తల్చుకుని నాలో కలిగే గర్వం - అందుకు కారణం. ఒక్కోసారి అనిపిస్తూ వుంటుంది. మృగాల్లా ప్రవర్తిస్తున్న మనుషుల్ని అదుపులో పెట్టటానికి భగవంతుడు వాడుతున్న కొరడా ఎయిడ్సేమోనని.

కానీ ఏ తప్పూ చేయని అమాయకమైన మనుషులు... డాక్టర్లు ఎక్కిస్తున్న రక్తం తమ ప్రాణాల్ని కాపాడుతుందని నమ్మేస్తూ... దాంతోపాటూ ఎయిడ్స్ వైరస్ తమలోకి ప్రవేశిస్తుందని తెలీని...

"ఎక్స్‌క్యూజ్ మీ సార్!"

ఆలోచనల్లోంచి తలయెత్తి చూశాను.

ఎదురుగా ముప్పయ్యేళ్ళ యువకుడు - బ్లూకలర్ షర్ట్‌ని వైట్‌ప్యాంట్‌లో టక్ చేసి. అతనికి కొద్ది ఎడంగా ఓ పాతికేళ్ళ యువతి..... లెమన్ ఎల్లో చీర చుట్టిన అజంతా శిల్ప సుందరిలా..

"ఎస్" అన్నాను.

"మా పాపకు టెస్ట్ చేయాలి" అన్నాడు.

అప్పుడు చూశానా పాపని.. నేను కూచుని వుండటం వల్లా - నా ముందరి టేబిల్ ఎత్తుగా వుండటం వల్లా - అకస్మాత్తుగా ఆలోచనల్లోంచి తేరుకుని వాళ్ళవైపు తలయెత్తి చూడటంవల్లా - నేనా పాపని మొదట గమనించలేదు.

ఆ పాపకు అయిదేళ్ళుంటాయేమో..... ముద్దుగా... బొద్దుగా.. రబ్బరు బొమ్మలా వుంది..

"హలో బేబి" అన్నాను అనాయాసంగానే..

నా వైపు చూసి "హలో అంకుల్" అంటూ మనోహరంగా నవ్వింది. పసిపిల్లల నవ్వెప్పుడూ అందంగానే వుంటుంది. మంచులో తడిసిన విరిసిన గులాబీల్లా...అందులో స్వచ్ఛత వుంటుంది- దైవత్వంలా... కానీ ఈ పాప నవ్వు... అద్భుతంగా వుంది. ఆ నవ్వులో ఇవన్నీ కాక మరో మాటలకందని ఆకర్షణ - మనసుని పట్టి బలంగా తనవైపుకు లాక్కునే ఆత్మీయతా - వున్నాయి.

"వాట్స్ యువర్ నేమ్ స్వీటీ" అన్నాను ఆ పాపని దగ్గరకు తీసుకుంటూ.

"వినీల" అంది మృదువుగా.

ఎంత అందమైన పేరు ! పాపకు తగిన పేరే!

మనసంతా ఓ క్షణం బాధతో నిండి పోయింది - ఇంత చిన్నపాపకు.... పాపపుణ్యాలంటే ఏమిటో తెలీని ఈ పసిదానికి ఎయిడ్స్ ఏమిటి? ఇటువంటి క్షణాల్లోనే భగవంతుడనేవాడున్నాడా అనే అనుమానం వస్తూంటుంది.

"కొన్నాళ్ళక్రితం పాప ఆడుకుంటూ, కత్తిపీటమీద పడిపోయింది. హాస్పిటల్‌కు తీసుకెళ్ళేలోపలే బోల్డంత రక్తం పోయింది. ఆ పరిస్థితుల్లో పాపకు బ్లడ్ ఎక్కించడం అనివార్యమైంది. మావారి బ్లడ్‌గ్రూప్ పాప బ్లడ్ గ్రూప్‌తో కలుస్తుంది. కానీ ఆ రోజు మావారు వూళ్ళో లేరు. క్యాంప్‌కెళ్ళి వారం అయింది. అందుకే రక్తం కొని ఎక్కించాల్సి వచ్చింది" అంది దిగులుగా ఆ పాప వాళ్ళమ్మ.

"బహుశా ఆ రక్తం ఎయిడ్స్ వైరస్‌వల్ల ఇన్‌ఫెక్ట్ అయినదేమోనని డాక్టర్‌గారి అనుమానం. ఈ మధ్య కొన్నాళ్ళుగా పాప అనారోగ్యంగా వుంటోంది. అందుకే ఆ పాజిబిలిటీని మొదట రూల్ అవుట్ చేయమని డాక్టర్ చెప్పడంతో మీ దగ్గరకు వచ్చాం" అన్నాడు వినీల తండ్రి.

రక్తం శాంపిల్ తీసుకున్న క్షణం నుంచీ నాలో నరాలు చిట్లిపోయేంత ఉత్కంఠ. ఆ పాపకు ఎయిడ్స్ వుండకూడదని నాకు తెల్సిన దేవుళ్ళందర్నీ మొక్కుకున్నాను. భగవంతుడి కరుణారసలక్షణం మీద నాకున్న నమ్మకం వమ్ముకాకుండా వుండాలంటే ఆ పాపకు రిజల్ట్ నెగిటివ్ రావాలి... అయ్యో! ఎంత చిన్న పాప! ఎయిడ్స్ అని నిర్ధారించాక ఏమిటి జరిగేది? ఎలాగూ దీనికి మందు లేదు. ఎటొచ్చీ ఆ వ్యక్తికి మానసికంగా నరకం అనుభవంలోకి తీసుకురావటం తప్ప!

ఎయిడ్స్ రోగి అని తెలిస్తే సమాజం వెలివేస్తుంది. ఈ మనుషులు కూడా ఎంత మూర్ఖులో - ఎన్ని ప్రకటనలు ఇప్పించినా సరే - ఎయిడ్స్ వ్యాధంటే చాలు - ఆ వ్యక్తిని తాకడానికి - ఆ వ్యక్తి సామీప్యంలో నిలబడటానికి కూడా భయపడతారు. ఆ జీవితం ఎంతటి దుర్భరమైనదో కదా! ఓ వైపు మృత్యువు సమీపిస్తున్న పద ఘట్టనలు వింటూ -

మరోవైపు ఆదరించే, అనురాగం పంచే వ్యక్తులు సమీపంలో లేక, అందరిచేతా పరిత్యజించబడి.. ఓహ్! పగవాడికి కూడా అటువంటి జీవితం వద్దు.

పెద్దవాళ్ళకే అంత దుస్సహమైనపుడు - ప్రతిక్షణం తల్లి ఒడిలోనో - తండ్రి వాత్సల్యంలోనో కరగాల్సిన పసిపాపకు...

నా చేతులు ఒణకటం నాకు స్పష్టంగా తెలుస్తోంది.

రిజల్ట్ చూసే ముందు మరోసారి నా ఇష్టదైవాన్ని తల్చుకున్నాను. "భగవంతుడా! ఈ చిన్ని గులాబీని మొగ్గగానే రేకుల్ని తెంపి ధూళిలో కలపటం నీకు 'న్యాయం కాదు' అని వేడుకున్నాను.

రిజల్ట్ వచ్చింది.

***

రిపోర్ట్ కవర్‌లో పెట్టి ఇస్తున్నప్పుడు మొఖం ఎప్పటిలా "భావశూన్యంగా" పెట్టాను.

పాప తండ్రి ఆ కాగితాన్ని తీసి చదువుతున్నప్పుడు అతనిలో అంతులేని టెన్షన్ - నాలో కూడా...

ఒక్కసారిగా అతను "ఓహ్ - గాడ్" అని అరిచాడు. నా ఎదురుగానే చేతులు ఎత్తి దేవుణ్ణి నమస్కరించాడు. అతనిలోంచి ఆనందం వరదలై, వెల్లువై అడ్డూ అదుపూ లేకుండా ప్రవహించటం నేను గమనిస్తున్నాను. పాప నెత్తుకుని గట్టిగా ముద్దుపెట్టుకున్నాడు. భార్యని బలంగా కౌగిలించుకున్నాడు. వాళ్ళిద్దరి కళ్లలో జలజలా రాలుతూ కన్నీళ్ళు - నా కళ్ళలో కూడా సన్నటి నీటి పార - ఎవరూ చూడకుండా తుడుచుకున్నాను.

వాళ్ళు సంతోషంగా వెళ్ళిపోయారు - ఆ గదిలో నన్నొంటరిగా వదిలేసి... అపుడొచ్చింది స్పృహ.. నేను ఒంటరిగా లేను.. నాకు తోడుగా "గిల్టీనెస్". జీవితంలో మొదటిసారి విధినిర్వహణలో తప్పుచేశానన్న ఫీలింగ్ .... "పాజిటివ్" వచ్చిన రిపోర్ట్‌ని మార్చి......... ....

● ఆంధ్రజ్యోతి వారపత్రిక 1 అక్టోబర్, 1993 ●